# బడిలనే దోస్తు వూరిలగాదు

జూపాక సుభద్ర

“జెండా వందనం ఎల్లుండే. అన్ని రడీగున్నయా నీకు” బ్యాగును మార్చుకుంటన్నది శ్రీలత తన దోస్తు సువర్ణతోని.

“అన్ని అంటే” కాల్లు నేలకు రాసుకుంటా దుమ్ము లేపుకుంటా నడుస్తూంది సువర్ణ.

“గదే స్కూల్ డ్రెస్సు, యింకా రిబ్బండ్లు గిట్ల రడీగ జేస్కున్నవా” శ్రీలత, తను గూడా కాల్లతోని దుమ్ము లేపుకుంటా నడుస్తున్నది.

“నాకు కొత్త డ్రెస్సున్నది రడీగనే, రిబ్బండ్లు గూడ కొత్తయే ఉన్నయి. మరి నీకో?” అడిగింది సువర్ణ శ్రీలతను.

“నాకొత్త డ్రెస్సులేదబ్బా. పాతదే, జెర కడక్ జేస్కోవాలె. సబ్బు రెండు మూడు సార్ల బెట్టి వుతుక్కోని, నీలి, గంజేసి యిస్తిరి గొట్టిత్తే, కొత్తవాటి లెక్కనే మెరుస్తయి” శ్రీలత వూరించుకంటా సెప్పింది. యింకా, “నువ్వు కొత్తయెప్పుడు కుట్టించుకున్నవు” అని అడిగింది సువర్ణను.

“మా బాపు స్కూలు దెర్సినప్పుడే మూడు జతల స్కూలు డ్రెస్సెలు కుట్టిచ్చిండు. దాంట్లె ఒక్కటే తీసిన. యింకా రెండు జతలు దాస్కున్న” అన్నది బింకంగా సువర్ణ. “మా అమ్మ పత్తులేరినంక కుట్టిత్తనన్నది. గప్పటిదాక గీ పాతయే యేస్కోవాలె” శ్రీలత నారాజుగ అన్నది.

శ్రీలత, సువర్ణ అఆల కాన్నుంచి ఒక్క స్కూల్లనే సదువుకున్నరు. వొక్క వూరోల్లే. వూల్లె ప్రైమరీ స్కూలైనంక పక్కూల్లె వున్న హైస్కూలుకు శ్రీలత వాల్ల తల్లిదండ్రులు పంపియ్యలేదు. వొక్క శ్రీలత వాల్లోల్లే కాదు వూల్లె ఏ ఆడపిల్లల తల్లిదండ్రులు పంపియ్యరు.

“వూల్లె బడికంటె, యిటు యిల్లు జూస్కుంట అటు బడికి బొయినా నడిసింది. యింట్ల కోడిపిల్లా నౌకొంకా యిడ్సిపెట్టి, కుండబోడి నాగంజేసి పక్కూల్లెకు మొగోనోలెబొయి ఏంజదువుతదితియ్ ఎవనికన్నిస్తే ఎల్లిపోయేది” అని అనుకున్నరు. శ్రీలతకు సదువాలని వున్నా తల్లిదండ్రుల కద్దం జెప్పలేదు.

శ్రీలత స్కూలుకు బోతలేదని తెల్సి స్కూలు టీచరు వాళ్ళింటికొచ్చి తల్లిదండ్రులతోని “నీ బిడ్డె చాన తెల్వికల్లది. గంత మంచిగ సదివే పిల్లను పొయి కుండలపాలు జేసి ఆమె బతుకు తెర్లు జెయ్యకండ్రి” అని

సెవినిల్లుగట్టుకోని పోరిండు.

అదీగాక సువర్ణతండ్రి సాలె సాంబన్న తన బిడ్డెకు శ్రీలత సోపతుంటదని యిద్దరు జతగ పోతరని శ్రీలత తండ్రి పోశాలును కూసోబెట్టుకొని "పోశన్నా! మసూరికి గా పెద్ద బడున్న సెన్నపురం ఏపాటి దూరమే! కీకెపెట్టులేదు. వూంచిన వూము ఆరకముందే పొయి రావచ్చు. నా బిడ్డె సువర్ణగూడున్నది. ఇద్దరు ఆడిపిల్లలు పొద్దుగాల సేతికందిన పంజేసుకొని మల్లా సందకాడ కండ్లముందుంటరు" అని చెప్పిండు.

"నాగ్గూడ తోలిద్దామనే ఉన్నదే కని తొవ్వలు బాగలేవని బుగులైతందే" అన్నడు పోశన్న. "యిన్నొద్దుల కాలంగాదు. లోకమోతీరు బోతాంటె మనమో తీరు బోతాంటిమి. ఏడు ముట్టెల్లకాలం గీ మట్టి బిసుక్కుంట, ఎద్దుముడ్డి బొడ్సుకుంటనే బతుకుతావే! గియన్నిడిసి పెట్టి నీ బిడ్డెను సదువుకు తోలె" అని సాంబయ్య పోశాలుకు వూరబిచుకకు దిగబోసినట్టు దిగబోసిండు.

పోశన్న బాగ ఆలోచించుకున్నడు. బిడ్డె కూలికిబోతూ మాడ్సుకున్న మొకం కన్నా, పుస్తకాల బ్యాగుతోని నవ్వుకుంట ఆడుకుంట స్కూలుకు బోయే మొకమే మంచిగుంటదనుకున్నడు.

"నివద్దేనే మన బిడ్డెలు తెల్విన బడ్తె మనమే మీసం దిప్పుతం. ఎట్లయిన మా శ్రీలతను సెన్నపురానికి సద్వుకు తోల్తతియ్యే" అని సాలె సాంబయ్యకు మాటిచ్చినట్లన్నడు.

అప్పటి కాన్నుంచి శ్రీలత, సువర్ణ మంచి దోస్తులైంద్రు. స్కూలుకు కల్సిపోతరు. కల్సి ఇంటికొస్తరు.

సువర్ణ వాల్ల నాయిన సైకిలు మోటరు మీద బట్టల మూటేసుకొని ఊరూరు తిరిగి అమ్ముతడు. తల్లి వ్యవసాయం జూసుకుంటంది. యిగ శ్రీలత వాల్లకు అరెకురం సెల్కున్నది. దాంట్లె పండే గింజలు అంతం మాత్రమే. తల్లి దండ్రి యిద్దరు కూలినాలి జేస్తరు.

శ్రీలత సువర్ణకంటె మంచిగ సద్వుతది. నోట్సులు బాగ రాస్తది. హెూమ్‌వర్కు మస్తుగ జేస్తది నాగ లేకుంట స్కూలుకు బోతది. శ్రీలతను సార్లు బాగ మెచ్చుకుంటరు. శ్రీలత యింట్ల ఏదన్న పసుండి స్కూలుకు రాకపోతే సువర్ణ గూడ మానుకుంటది. శ్రీలత లేకుంటె సువర్ణకు పొద్దుపొద్దు. శ్రీలతక్కూడా అంతే. ఎప్పుడన్నా కొట్లాడుకున్నా, మల్లా తొవ్వల కల్సి మాట్లాడుకుంటరు. కల్సి ఆడకుంటరు. ఆడుకుంట యింటికొస్తరు. శ్రీలత, సువర్ణ తినేటియి దెచ్చుకొని ఒకరి కొకరు ఇచ్చుకుంటరు. సోకుల దండలు, గాజులు, బొట్టు ఒకరియి ఒకరికి బెట్టుకొని సంబుర పడ్తరు. గివన్ని బడిలో, తొవ్వల్లనే జరుగుతయి. వూల్లెకు ఏందెల్వని ఎల్లిపాయల్లెక్కనే ఎవలిండ్లకు వాల్లు బోతరు.

“అయితె కొత్త బట్టలేసుకుంటలేవా” సువర్ణ మల్లా అడిగింది.

“లేందెక్కడేసుకోను” సిన్నమొకంజేసుకోని శ్రీలత అన్నది.

“నాకు రెండున్నయి గదా ఒకటేసుకో” సువర్ణ మురిపంగన్నది శ్రీలత మొకంలకు జూసుకుంట.

“అమ్మో వద్దబ్బా, మీ వోల్లకు తెలిస్తె వూకుంటరా” శ్రీలత భయంగ...“వాల్లకు తెల్వకుంట తీసుకొస్త” అన్నది సువర్ణ ధీమగ.

“అమ్మో! మీ అమ్మ ముందట నువ్వు నా చేయి పట్టుకుంటేనే కిందికి మీదికి సూసి మొకం వంద వంకర్లు పెట్టుకుంటది” శ్రీలత అన్నది గుర్తుజేస్తూ.

“ఒక్క రోజుకేనాయె అట్లేసుకొని యిట్లిప్పుదువు తియ్, దండలు గాజులు మార్సుకుంటలేమా గట్లెనే గియ్యి” సువర్ణ అంది, సదుమాయిస్తూ గీమాలినట్లుగ.

శ్రీలత క్యాడ కొత్త డ్రెస్సు ఏసుకొని మురుసుకోవాలనే వున్నా నవ్వులు బొయి నువ్వులైతయనీ, ఎవలకన్న దెలిస్తే లేనిపోని కొట్లాటలు దంపులాటలు, ఏ కొట్లాటైనా ఆ కోపం “బడిబందువెట్లు” అనే కాడికి పోతది. ఎందుకొచ్చిన గొడువ అని భయపడ్డా, సువర్ణ కోసం సరెనని కూడబలుక్కొని ఎవరిండ్లకు వాల్లు బోయింద్రు. తెల్లారి సువర్ణ స్కూలుకు పోతూ పుస్తకాల బ్యాగుల కొత్త డ్రెస్సు పెట్టుకొనివచ్చి శ్రీలత బ్యాగుల పెట్టుకుంట “రేపేసుకోవాలె” అన్నది.

శ్రీలత బ్యాగుల బట్టలైతే తెచ్చుకున్నది గానీ, యింట్ల తల్లిదండ్రులడిగితే ఏంజెప్పాలె, ఎట్ల జెప్పాలె వాల్లు సూత్తే “మంది సొమ్ములెందుకే” అని, యాడదిద్దరో అని భయపడ్డది. కాని వాల్లు పొద్దుబోతుందని పొద్దుపొడవక ముందే  కూల్లకు ఉరికింద్రు. కొత్తబట్టలేస్కునేదానికి శ్రీలతకు యింక ఏ అడ్డం లేదనిపిచ్చి సంబరపడ్డది.

పంద్రాగస్టు పొద్దుగాల్నే శ్రీలత, సువర్ణ కొత్త యూనిఫాముల్లో స్కూలుకు బొయి జెండావందనం సంబరంల వున్నా శ్రీలతకు యింక ఏ అడ్డం లేదనిపిచ్చి సంబరపడ్డది.

పంద్రాగస్టు పొద్దుగాల్నే శ్రీలత, సువర్ణ కొత్త యూనిఫాముల్లో స్కూలుకు బొయి జెండావందనం సంబరంల వున్నా శ్రీలతకు “ఎరువు సొమ్ము పరువు సేటైతదని” లోపల గుట గుటనే వున్నది. యింటికొస్తాంటే ఒకరిద్దరు అడుగనే అడిగింద్రు “మీ అయ్య సేతుల తూటుపైసే లేదని బట్టలు మంచిగనే పట్టించిండే పోల్ల” అని.

టీచర్లిచ్చిన చాక్లెట్లు బిస్కెట్లు దినుకుంట ఇద్దరు ఎవరిండ్లకు వాల్లు జేరుతూ, శ్రీలతతోని సువర్ణ "డ్రెస్సు వుత్కకు. ఇంటికి బోంగనే ఇడ్సి పేపర్ల జుట్టి బ్యాగుల పెట్టి రేపు పట్కరా" అన్నది.

"వుత్కద్దా!" ఆశ్చర్యంగ అన్నది శ్రీలత.

"వుతికితే కొత్త డ్రెసెక్కడిదని మీ యింట్లడుగుతరు మన గుట్టంత సెట్టెక్కుతది" అనుకుంట బిరాన యింటికి వురికింది సువర్ణ.

తరువాత రోజు శ్రీలత కాయితంల సుట్టిచ్చిన బట్టల్ని పుస్తకాల బ్యాగుల బెట్టి యింటికి వచ్చింది సువర్ణ. బిడ్డను సూడంగనే సువర్ణ తల్లి "అచ్చినవా బిడ్డ! గా దుడ్డె తాడు దెంపుకొని వురుకుతంది జెర కొట్కరాపో!" అని సువర్ణ బుజమ్మీది పుస్తకాల సంచి తీస్కుంటూ "దుడ్డెపాడుపడ గింత ఇంటి పట్టున వుండదాయె! ఏ తాడులుంటలేవు దీన్ని గట్టెయ్యనీకి" అని అనుకుంటా బ్యాగును యింట్ల సిలుక్కొయ్యకు తగిలిచ్చింది.

యింతల గౌండ్ల బూనుక్కొచ్చి "కొవురక్కా నీ బిడ్డె అచ్చిందా?"

"ఆ అచ్చి గా దుడ్డెను గెదుముక రాను వురికింది. దాంతో ఏంపని సెల్లే!"

"జెర పెన్నిత్తదేమోనని"

"పెన్నా! పెన్నెందుకు?"

"నా కొడుకు....గా బుచ్చిరెడ్డి కొడుకుది అడ్రసు రాస్కుంటడాట" అడిగింది బూమక్క.

సువర్ణ తల్లి యింట్లకు బొయి సంచిల చెయి బెట్టింది. పెన్ను సేతికి దొరుకకుంటే అడ్డమున్న బట్టల సుట్టను, పుస్తకాలను బైటికి దీసి పెన్ను యెతికి బూమక్క కిచ్చింది. మల్లా పుస్తకాలు బ్యాగుల పెట్టబోతే యిచ్చుకపోయిన పేపర్ల బట్టలు కనిపిచ్చినయి. జెర మాసిపోయిన తెల్ల జాకెట్టు నీలంకలర్ లంగ కనబడంగనే "పొల్ల మాసిన బట్టలు సంచెలెందుకు పెట్టుకున్నదో" వచ్చినంక అడుగుదామని పక్కపోంటి బెట్టింది.

సువర్ణ దుడ్డెను కొట్టుకొని వచ్చినంక "బిడ్డా! నీ సంచిల యిడ్సిన బట్టలెక్కడియే" అన్నది దుడ్డెను కట్టెయ్యనీకి తగులందిస్తూ, సువర్ణకు అంత అధాటుగ అడిగేసరికి ఎటు సమజుగాలే. తల్లి జూస్తదని, సూసి అడుగుతదని అనుకోలే. ఏం చెప్పాల్నో తెల్వలేదు అబద్ధం అల్లుకొనే దానిక్కూడా మొసమర్రక, వున్న సంగతి జెప్పింది

నసుగుతూ భయపడుతూ.

“నీకేంబుట్టిందే గా మాదిగోల్ల పిల్లకిచ్చి మల్లదెచ్చుడేందే, తెచ్చి పుస్తకాలల్ల వెట్టుడేందే” అనుకుంట దబదబ యింట్లకు బొయి కాగితం వున్న బట్టల్ని వాకిట్ల యిసిరేసింది కోపం పట్టలేక.

“మాదోస్తని యిచ్చిన్నే, ఇస్తేమైతది” మెల్లెగన్నది సువర్ణ.

“దోస్తు గీస్తు అంత బల్లెనే గీ మన వూల్లెగాదు. కొత్త బట్టలు పాడుజేత్తివి గదనే గీ బట్టలకగ్గివెట్టా! మల్లింట్ల కెందుకు దెచ్చినవే, అదేసుకున్నయి మల్లా నువ్వేస్కుంటావె. నీకు దెల్వకుంటె దానికన్న దెల్వదే. తొడిగిడ్సిన బట్టలు నీతోని మోసిత్తదానే” అని బిడ్డెను ఎటుబడితే అటేకొట్టింది. యింకా కోపంతోని “దాని సదువు సట్టుబండలుగాను, నాలుగచ్చరాలు నేర్సుకోంగనే సిన్నంత్రం పెద్దంత్రం దెల్వకుంటైెందా, కండ్లకంత కనరు పెరిగిందా, దానవ్వయ్యలు ఎక్కువోల్లు తక్కువోల్లనే బుద్దులు చెప్పుకోలేదా, యింకా యీన్నే వున్నవేమే గాసునూనెబోసి వాటికగ్గివెట్టు”...అని బిడ్డెను తరిమి గోలెంకాడికి బొయి సేతులు కడుక్కున్నది ఆ బట్టలు ముట్టుకున్ననని. సువర్ణ కాయితంలకెల్లి బైటపడ్డ బట్టలు సూసుకుంట ఏడ్సుకుంట నిలబడ్డది.

“పాపం శ్రీలత భయపడిందంత జరుగనే జరిగింది. గీ దుడ్డెపెయ్య జెయ్యపట్టి రాంగనే జెప్పున బ్యాగిచ్చి వురుకుడైంది లేకుంటె యింట్లకు బోంగనే ఆ బట్టలు తీసి తెల్వనికాడ దాపెడ్దును గీ దుడ్డుకునా వారేద్దు” అని తిట్టుకున్నది మనసుల. తనను తల్లి కొట్టిందానికంటే తన ప్రాణమసొంటి దోస్తును దిట్టినందుకు ఎక్కువ దుక్కమొచ్చి ఎక్కెక్కి పడేడ్సుకుంట తడ్కకానుకొని నిలవడ్డది సువర్ణ.

“మన్సివిగావె ఆ బట్టల మీదింత గాసునూనెవోసి తలగవెట్టుమంటె మకుర నిల్సున్నట్టు నిల్సుంటి” పని పొయికాన్నించి గ్యాసునూనె సీస దెచ్చి ఆ బట్టల మీద పోసి అంటబెట్టడానికి పొయింది. ఏడ్సుకుంట నిలుచున్న సువర్ణకు సరుక్కున తల్కాయల వో మెరుపు మెరిసి, సెయికి, కాలికి బుద్దిజెప్పి, చెయి ఆ విసిరేసిన బట్టలు పట్టుకోంగనే, కాళ్ళు లగాయించి శ్రీలత యింటివైపు దౌడు తీసినయి, సువర్ణ తల్లి బీరిపోయి అట్లనే నిలబడిపోయింది బిడ్డ వెనుక దౌడు తీయలేక....